క్లుప్తంగా

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో భక్తులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీమదన వేణుగోపాలస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు సాగే వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొట్నం, ఎదురుకోళ్ల అంగరంగా వైభవంగా నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, పౌరాణిక పండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశికతో పాటు భక్తులు, భక్త మాతలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మఠమాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

మల్యాల: మండల కేంద్రంలోని శ్రీ మఠమాంజనేయస్వామి ఆలయం 25వ వార్షికోత్సవ వేడుకలను రెండు రోజులు ఈ నెల 20,21న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. సోమవారం హనుమాన్ దీక్షాపరులు, భక్తుల నగర సంకీర్తన, ప్రత్యేక పూజలు, సాయంత్రం సామూహిక కుంకుమపూజ నిర్వహించనున్నారు. 21న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అన్నదానం చేయనున్నారు. వేడుకల్లో వందలాదిమంది భక్తులు పాల్గొనాలని ఆధ్యాత్మిక గురువు మిట్టపల్లి లక్ష్మీనారాయణ కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న సుభాష్

బుగ్గారం: మండలంలోని గంగాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ రూ.10 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ పెద్దలు,సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిరవేణి పెద్దనర్సయ్య,సిరవేణి సురేష్,రెంటం శ్రీధర్,మామిడాల శ్రీనివాస్,కట్ట తిరుపతి,పెంజర్ల పరశురామ్,గుర్రపు తిరుపతి, చెక్కపల్లి గంగన్న పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి..



విరాళం అందజేస్తున్న దాతలు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి పలువురు దాతలు ఆదివారం రూ.10 వేల విరాళం ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్‌కు అందజేశారు. జిల్లా కేంద్రంలోని చిలుకవాడకు చెందిన తిప్పర్తి కృష్ణసాగర్, ప్రణవి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా రూ 5 వేలు, కోరుట్లలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన క్యాతం వెంకటయ్య–లక్ష్మి దంపతులు రూ 5 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వహణ కమిటీ సభ్యులు గిరి నాగభూషణం, బాపురెడ్డి, సత్తయ్య, బాలె శంకర్, సుదర్శన్, గౌరిశంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న యువకులు

రాయికల్: రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి యువకులు బాసటగా నిలిచారు. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మ్యాదారపు అనిల్‌కుమార్ (22) అనే యువకుడు కడెం వెళ్లి వస్తుండగా ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఏడు నెలల కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న భూపతిపూర్ గ్రామానికి చెందిన కచేరి కాడ ముచ్చట్లు అనే గ్రూపు సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం వితరణ

మేడిపల్లి: భీమారం మండలంలోని పసునూర్‌లో కొప్పుల దేవయ్య అను వ్యక్తి అనారోగ్యంతో మరణించగా, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో లచ్చ నాయక్, జీతేందర్, అజయ్,పాల్గొన్నారు.

గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు

- రెండేళ్లుగా రాని స్టేట్ ఫైనాన్స్ నిధులు
- పట్టుదలతో వంద శాతం వసూలు చేసిన అధికారులు
- ఇంటి పన్నులే పంచాయతీలకు ఆధారం



ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామ పంచాయతీ భవనం

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఇంటి పన్నులే ఆధారం.. కాబట్టి ఇంటి పన్నులు వసూలు చేస్తేనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికలు కాగానే వెంటనే లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో అంతంత మాత్రంగానే అభివృద్ధి జరిగింది. దీంతో పై అధికారుల ఆదేశాలతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎలాగైనా నిధులను జమ చేయాలని మండల పంచాయతీ కార్యదర్శులు మార్చి 31 వరకు వంద శాతం పన్నులు వసూలు చేశారు. మండలంలోని 17 గ్రామాల్లో 84.90 లక్షల రూపాయల పన్నులు వసూలు చేశారు. ఈ పన్నుల వసూళ్లతోనే గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు, పారిశుధ్య పనులకు, వీధి దీపాలకు ఖర్చులు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్ల కోసం గ్రామాల్లో మైకులతో ప్రచారం చేసి తమ సిబ్బందితో వాడ వాడ తిరిగి ఇళ్లకు వెళ్లి ఇంటి పన్నులు కట్టించారు. పన్నులు కట్టనివారిని గుర్తించి వారి వద్దకు వెళ్లి ఇంటి పన్నులు కడితే గ్రామం అభివృద్ధి చెందుతుందని అవగాహన కల్పించి మొండి బకాయిలు సైతం వసూలు చేశారు.

గ్రామ పంచాయతీలు ఇంటి పన్నే ఆధారం..

గ్రామ పంచాయతీలకు రెండేళ్లుగా స్టేట్ ఫైనాన్స్ నిధులు రాలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు తప్పా వేరే రాబడి లేకుండా పోయింది. దీంతో ఇంటి పన్నులు పకడ్బందీగా వసూలు చేయడం వలన ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ.3 లక్షల నుంచి 6 లక్షల వరకు పన్నులు వసూలయ్యాయి. ఈ పన్నులతో గ్రామాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు, వీధి దీపాల నిర్వహణకు ఖర్చు పెట్టనున్నట్లు కార్యదర్శులు తెలిపారు.

నోటీసులు అందజేశాం



ఇంటి పన్నుల వసూళ్ల కోసం ప్రతి ఇంటికి డిమాండ్ నోటీసులను అందజేశాం. వాట్సాప్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేశాం. సకాలంలో ఇంటి పన్నులు చెల్లించడం వలన కలిగే ప్రయోజనాలను ఇంటి యజమానులకు అవగాహన కల్పించి వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేశాం.

– రాకేశ్, పంచాయతీ కార్యదర్శి,వర్షకొండ

ఇంటింటికీ వెళ్లి వసూలు చేశాం



ఇంటి పన్నుల వసూళ్ల కోసం తమ సిబ్బందితో ప్రతి రోజు ప్రతి ఇంటికి వెళ్లి వసూలు చేస్తున్నాం. కట్టని వారు, మొండికి వేసే వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి పట్టుబట్టి ఇంటి పన్నులను వసూలు చేయడం వలన వంద శాతం పన్నులు వసూలు అయ్యాయి. ఈ పన్నుల వసూళ్లు అభివృద్ధికి ఉపయోగ పడుతాయి.

– రాణి, పంచాయతీ కార్యదర్శి, దబ్బా

కార్యదర్శుల సహకారం



ఇంటి పన్నుల వసూళ్లకు ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తూ వారి సహకారంతో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేశాం. అన్ని గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్లకు పంచాయతీ కార్యదర్శులు అందరూ సమన్వయంతో పనిచేసి లక్ష్యం సాధించారు.

– కృపాకర్, ఎంపీవో,ఇబ్రహీంపట్నం

రైతుల శ్రమదోపిడీ చేస్తున్న మిల్లర్లు



ధాన్యం అన్‌లోడ్ చేయక ఓ రైస్ మిల్లు ముందు బారులుతీరిన లారీలు

మేడిపల్లి: మండలంలోని కట్లకుంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారం రైతులకు–ఐకేపీ సెంటర్ నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తప్ప తాలు పేరుతో బస్తా కి రెండు నుంచి నాలుగు కిలోలు అధనంగా ధాన్యం కోత విధిస్తున్నారన్నారు. తేమ శాతం 17 వస్తున్నప్పటికీ వర్షభావంతో అధిక తేమ శాతం పెరిగిందని నాలుగు కిలోలు అదనంగా కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి తేమ శాతం పరిశీలించి సర్టిఫై చేసిన ధాన్యాన్ని, సెంటర్ నిర్వాహకులు తూకం వేసి మిల్లుకు తరలించగా, తేమశాతం పెరిగిందని సెంటర్ నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, అధికారులు, కుమ్మక్కై కోతలు విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు వారి షరతులకు ఒప్పుకోకపోతే ధాన్యం దించుకోవడం లేదని రైతులు వాపోయారు.దీనిపై ఏపీఎం అశోక్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని రైతులు తెలిపారు. బీమారం మండలంలోని పలు కేంద్రాల్లో కూడా ఇదే తంతు జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పల్లకుంట ఏర్పాటుకు అటవీశాఖ చొరవ చూపాలి



ఇప్పల్లకుంట ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతం

సారంగాపూర్: భూగర్భజలాల పెంపు, వన్యప్రాణుల కోసం విరివిగా నీటి లభ్యత కోసం అటవీశాఖ అధికారులు గతంలో ఇప్పల్లలో నీటి కుంట (పర్కులేషన్ ట్యాంక్) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సారంగాపూర్‌కు పడమటి వైపు ఈ కుంట ఏర్పాటు చేస్తే కుంట కింద బావుల్లో భూగర్భ జలాల పెరగడంతో పాటు, అటవీప్రాంతంలో ఉండే వన్యప్రాణులకు నీరు అందుతుందని అటవీశాఖ అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. కంపా నిధుల కింద కుంట ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. కుంట ఏర్పాటు జరిగితే గుట్టలపై నుంచి వచ్చే వర్షపు నీటితో పాటు, వాగుల ద్వారా వచ్చే నీరు కుంటలో ఏడాది పొడవున నీరు ఉండేందుకు అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో వన్యప్రాణులు ఎక్కువగా నివాసం ఉండేందుకు అనుకూలంగా ఉంటుంది. వేసవిలో తాగునీటి కోసం వన్యప్రాణులు వ్యవసాయ బావులు, పంట పొలాలకు వద్దకు రావడంతో కొంత మంది వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతున్నారు. అటవీశాఖ దాదాపు రూ.5 లక్షల వరకు వెచ్చిస్తే కుంట ఏర్పాటు చేయొచ్చని సారంగాపూర్ గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

'ప్రభుత్వ వైఫల్యం వల్లే కొనుగోళ్లలో జాప్యం'



మాట్లాడుతున్న వికాశ్‌రావు

కథలాపూర్: ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం వైఫల్యం వల్లే తూకంలో జాప్యం జరుగుతుందని, వర్షాలు కురిసి ధాన్యానికి నష్టం జరిగిన కొనుగోళ్లు వేగవంతం చేయకపోవడం దారుణమని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాశ్‌రావు అన్నారు. కథలాపూర్ మండలం పోసానిపేటలో ఆదివారం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే సమయంలో రైస్‌మిల్లర్లతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండేదని, ఇవేమి పట్టించుకోకపోవడంతో రైస్‌మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైస్‌మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కైనట్లు అనుమానం వస్తుందని, అందువల్లే క్వింటాలుకు 5 కిలోలు కోతలు విధించి రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారని మండిపడ్డారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో కథలాపూర్, మేడిపెల్లి మండలాల బీజేపీ అధ్యక్షులు కంటె సత్యనారాయణ, ముంజ శ్రీనివాస్‌గౌడ్, వేములవాడ బీజేపీ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, ఎస్ ఎన్ రెడ్డి, తొగరి లక్ష్మీపతి, మండల నాయకులు వెంకటేశ్వర్ రావు, గాంధారి శ్రీనివాస్, మల్యాల మారుతి, పిడుగు ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ టాపర్‌కు సన్మానం



అశ్వితను సన్మానిస్తున్న అలయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ మోడల్ స్కూల్‌లో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించి మండల టాపర్ గా నిలిచిన జెమ్ అశ్వితను అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సినారే కళాభవన్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు బాల గంగాధర శాస్త్రి, కటుకం రాజేంద్ర ప్రసాద్, సురేందర్, పాల్గొన్నారు.

ఐదుగురు యువకుల రక్తదానం

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన మ్యాదరి బాబు అనే వ్యక్తికి ఆపరేషన్ నిమిత్తం ఏ– పాజిటివ్ రక్తం అవసరం కావడంతో యువకులు స్పందించి ఆదివారం కరీంనగర్ వెళ్లి రక్తదానం చేశారు. సిరికొండ గ్రామానికి చెందిన రాదారపు భరత్, శనిగారపు మిట్టు, పుప్పాల ప్రశాంత్, సాయికిరణ్, కరీంనగర్‌కు చెందిన రవి రక్తదానం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వీరిని స్థానిక నాయకుడు దొప్పల జలందర్ రక్తదానం చేసేందుకు ప్రోత్సహించారన్నారు. వీరిని పలువురు అభినందించారు.

ఆకట్టుకున్న రజతోత్సవ వేడుకలు



1996-99 బ్యాచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

కోరుట్లటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన 1996–99 బ్యాచ్ ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులు ఆదివారం రజతోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. పాతజ్ఞాపకాలు నెమరేసుకుంటూ సంతోషంగా గడిపారు. అధ్యాపకులను సన్మానించారు. ఉపన్యాసకులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడం గర్వకారణంగా ఉందన్నారు. 25 ఏళ్ల గుర్తు పెట్టుకుని ఆత్మీయ సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసవి, ఉపన్యాసకులు విద్యాసాగర్ రెడ్డి, మేడి కిషన్, అశోక్, క్యాతం వెంకయ్య, పూర్వ విద్యార్థులు ఏలేటి ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, నవీన్, దోనె తిరుపతి, శ్రీనివాస్, ప్రసాద్, చంద్రశేఖర్, కవిత, వాణి, మాధవి, కమిటీ ప్రతినిధులు గోనె శంకర్, రాజారాం, విశ్వనాథం, జగన్, 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గర్వంగా ఉంది



విద్యా బుద్ధులు నేర్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగిన విద్యార్థులను చూస్తే గర్వంగా ఉంది. 25 ఏళ్లకు గుర్తుంచుకుని పిలిచి, ఆత్మీయంగా సన్మానించడం ఎంతో సంతృప్తిని కలిగించింది.

– విద్యాసాగర్‌రెడ్డి, కామర్స్ అధ్యాపకులు, కోరుట్ల

స్నేహితులను కలుసుకోవడం సంతోషం



25 ఏళ్లకు స్నేహితులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. కాలేజీ జ్ఞాపకాలు గుర్తు చేసుకొని, అందరం ఆనందం పంచుకున్నాం.

– లక్ష్మీరాజం, పూర్వ విద్యార్థి, కోరుట్ల

అధ్యాపకులను ఆత్మీయంగా గౌరవించాం



అధ్యాపకులకు ఆత్మీయంగా గౌరవించడం ఆనందం కలిగించింది. పాత స్నేహితుల పరిచయం కొత్త అనుభూతి కలిగించింది.

– రాజనరేందర్, తహసీల్దార్, పూర్వ విద్యార్థి, కోరుట్ల

క్రికెట్ కప్ విజేత దమ్మన్నపేట



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

గొల్లపల్లి: మండలంలోని బీమ్రాజ్‌పల్లిలో నిర్వహించిన బీబీకే క్రికెట్ టోర్నమెంట్‌లో దమ్మన్నపేట టీం విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో లక్ష్మీపూర్, దమ్మన్నపేట జట్లు తలపడగా దమ్మన్నపేట జట్టు విన్నర్‌గా, లక్ష్మీపూర్ టీం రన్నరప్‌గా నిలిచారు. సాగర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. బీకే కప్ ట్రోఫీని నిర్వాహకులు బొమ్మెన కుమార్, ముక్తామని నరేందర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొమ్మెన నరేందర్, వెంకటేశం, చౌటపెల్లి తిరుపతి, కంది స్వామి, సింగారపు లచ్చయ్య, మహేశ్, సాగర్, రవి, రాయలింగు పాల్గొన్నారు.

వేసవిలో కూరగాయల సాగుకు సమాయత్తం



పందిరితీగ సాగుకు ఏర్పాట్లు చేస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: వేసవిలో తీగజాతి కూరగాయల సాగును చేసేందుకు రైతన్నలు ఆరాటపడుతున్నారు. ఇప్పుడు సాగు చేసే కూరగాయల పంటలు జూన్, జూలై, ఆగస్టులో మార్కెట్‌కు వచ్చేలా రైతులు సాగు చేస్తున్నారు. ఈ నెలల్లో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు రాకపోవడంతో స్థానికంగా మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. దీనికోసం ముందు వేసవిలో తోటలను దున్నించి, బెడ్లు వేసి, వాటిపై డ్రిప్ పైపులు పరిచి, కలుపు రాకుండా మల్చింగ్ వేసి, తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సోరకాయ పంటల హైబ్రిడ్ విత్తనాలు నాటుతున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల చుట్టు పక్క గ్రామాల రైతులు కొంత విస్తీర్ణంలో రాతి స్తంభాలు సిమెంట్ పోల్స్ వేసి, వాటిపై ఇనుప తీగలను జల్లెడగా వేసి, కూరగాయలు పండించి, మంచి ఆదాయం పొందుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల రూరల్: పట్టణంలోని చిన్నతోటవాడ, గాంధీ రోడ్, జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ఏరియా, ఐబీ గెస్ట్ హౌజ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ తెలిపారు.

కోరుట్ల మండలంలో..

మండలంలోని మాదాపూర్, మోహన్‌రావుపేట గ్రామాలతో పాటు మున్సిపల్ పరిధిలోని యూసీన్‌పూర్ రూరల్ ఫీడర్ ఏరియాలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ భుక్యా శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోదూర్, యామాపూర్, వూములకుర్తి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ ఏఈ సతీష్ తెలిపారు.

బుగ్గారం: మండలంలోని సిరికొండ, మద్దునూర్, గోపులాపూర్,బీర్సాని, వెనుగుమట్ల, లొత్తునూర్ గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బండారి అశోక్ తెలిపారు.

నూతన కార్యవర్గం



ఎంపికైన నూతన కార్యవర్గం

రాయికల్: ఫోటో అండ్ వీడియోగ్రఫీ సంఘం మండల అధ్యక్షుడిగా తాళ్ల సురేశ్, ప్రధాన కార్యదర్శిగా గుగ్గిల్ల రాజు, కోశాధికారిగా గుగ్గిల్ల రాజేందర్ నియమితులయ్యారు.

డ్రెయినేజీ బాగు చేశారు..!

సాక్షి స్పందన

కోరుట్ల: పట్టణంలోని డైమండ్ హోటల్ ఎదురు సందులో డ్రెయినేజీ మట్టితో పూడుకుపోయి వర్షం నీరు ఇళ్లలోకి చేరుతోంది. దీనిపై ఈ నెల 15న సాక్షిలో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి స్పందించి మురికి కాల్వ బాగు చేయాలని శానిటరీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది మురికి కాల్వను బాగు చేయడంతో స్థానికులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

